కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ విద్యాలయం (బాబామెట్ట) లో ఒకటవ తరగతి ప్రవేశానికి ఆన్ లైన్‌లో దరఖాస్తులు ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 10గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించ నున్నట్లు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ దిలీప్ మోడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటవ తరగతిలో 32 సీట్లకు గాను 8 సీట్లను అర్‌టిఇ చట్టం ప్రకారం రిజర్వు చేసినట్లు తెలిపారు. రెండో తరగతి ఆపై తరగతులకు 1వ తేదీ నుంచి 10వ తేదీ సాయంత్రం 4గంటల వరకు ఆఫ్ లైన్ లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు https://kvsonlineadmission.kvs.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

కార్పొరేట్ వల

- ప్రారంభమైన అడ్మిషన్లు వేట
- తల్లిదండ్రులకు ఫోన్లు, ఎస్‌ఎంఎస్‌ల జోరు
- భారీగా పెరిగిన ఫీజులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులపై కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పటి నుంచే వల వేశాయి. తమ కళాశాలలు, పాఠశాలల్లోనే చేరాలని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చదువుతున్న స్కూల్స్ నుంచి మరో స్కూలుకు మారకుండా ఓవైపు.. కొత్త విద్యార్థులను చేర్చుకునేందుకు మరోవైపు కార్పొరేట్ స్కూల్సు, కాలేజీలు చర్యలు చేపట్టాయి. పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో కార్పొరేట్ కళాశాలలు తమ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశాయి. యాజమాన్యాలు ఏకంగా గ్రామాల్లో సైతం మధ్యవర్తులను పెట్టుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కాలేజీల ప్రత్యేకతలను వివరిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు సేకరించి వారికి ఎస్‌ఎంఎస్‌లు పంపుతూ, ఫోన్లు చేస్తూ తమ కళాశాలలు, పాఠశాలల్లో చేరాలని ఒత్తిడి చేస్తున్నారు. ఎలాగోలా విద్యార్థులను చేర్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరీక్షలు పూర్తి అయిన తరువాతనే అడ్మిషన్లు నిర్వహిస్తారు. కానీ ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ముందుగా సీటును రిజర్వ్ చేసుకుంటే రాయితీలు కల్పిస్తామంటూ లేనిపోని ప్రకటనలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వివిధ కోర్సులను ప్యాకేజీగా రూపొందించి 20 నుంచి 40 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి అడ్మిషన్లు సేకరిస్తున్నాయి.

ఆర్థిక పరిపుష్టిత లేకపోయినా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా మంచి కాలేజీలో చేర్పించాలని తల్లిదండ్రులు యోచిస్తున్నారు.. దీనిని క్యాష్ చేసుకునేందుకు కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు ప్రయత్నిస్తున్నాయి. తమ కళాశాలలో ఉత్తమ బోధనతోపాటు ఫలానా ప్రత్యేకతలు ఉన్నాయని, చేరితే రాయితీలు ఇస్తామంటూ ఊదరగొడుతున్నారు. విద్యార్థుల చిరునామా, ఫోన్ నెంబర్లు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు ఇప్పటికే సేకరించారు. ఆ విద్యార్థి మార్కులు, కుటుంబ ఆర్థిక స్థోమతను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు సంస్థల ప్రతినిధులు, స్థానికంగా నియమించుకున్న మధ్యవర్తుల ద్వారా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్తున్నారు. తమ కళాశాలలో చేర్చితే ఫీజు రాయితీ ఇస్తామనీ, సౌకర్యాలు కల్పిస్తామనీ, పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని, ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని మభ్య పెడుతున్నారు. మరోవైపు ఉపాధ్యాయుల ద్వారా గాలం వేస్తున్నారు. కార్పొరేట్ సంస్థలకు తామేమీ తక్కువ కాదని జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలలు కూడా విద్యార్థులకు వల వేస్తున్నాయి. కళాశాలలో ఎసి, నానా ఎసి,డేస్కాలర్, హాస్టల్, మెస్ తదితర ప్రత్యేకతలు చెబుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. వెంటనే డబ్బు చెల్లించి, సీటుఖరారు చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. మెరుగైన మార్కులు సాధించిన వారికి ప్రత్యేక రాయితీలు అంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎటూ తేల్చు కోలేకపోతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలమాయమాటలు నమ్మి, కొందరు తల్లిదండ్రులు పిల్లలను చేర్పించేస్తున్నారు. మరి కొందరు కళాశాల చూసిన తరువాత చెబుతామని బదులిస్తున్నారు.

భారీగా ఫీజులు

వచ్చే విద్యాసంవత్సరానికి కార్పొరేట్ విద్యాసంస్థలు భారీగా ఫీజులు పెంచేశాయి. నారాయణ, చైతన్య పాఠశాలలు 1 నుంచి పదో తరగతి వరకు 5వేలు నుంచి రూ.10వేలు వరకు ఫీజులు పెంచేయగా, ఆయా కళాశాలల్లో ఇంటర్‌కు ఏకంగా ఏడాదికి హాస్టల్‌తో కలిసి రూ.2.50లక్షల నుంచి రూ.350లక్షలు వరకు వసూలు చేస్తున్నారు. ఫీజులను నియంత్రిస్తామని చెప్పిన వైసిపి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోపోవడంతో అనివార్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం ఆస్తులను అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. మరికొందరు అప్పుల పాలవుతున్నారు.

రీపోలింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-బొబ్బిలి

రీపోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక గురుకుల పాఠశాలలో ఎన్నికల అధికారులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండక పోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. దొంగ ఓట్లు వేసేందుకు ఆస్కారం ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. పిఒ అందుబాటులో లేకపోతే ఎపిఒలే ఆ బాధ్యత వహించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏజెంట్లుగా ఉండకూడదన్నారు. వాలంటీర్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించవద్దని ఆదేశించారు. ఆమె వెంట ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ, తహశీల్దార్లు ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

వికలాంగులకు మినహాయింపు ఇవ్వాలి

ఎన్నికల విధుల నుంచి వికలాంగ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని వికలాంగ మహిళా ఉద్యోగి... కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కోరారు. ఎన్నికల శిక్షణ కేంద్రానికి వచ్చిన కలెక్టర్‌ను ఆమె కలిశారు. ఎన్నికల విధులకు తనను నియమించారని, ఎలా ఎన్నికల విధులకు వెళ్లగలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు పెడితే పరిశీలిస్తామని కలెక్టర్ చెప్పారు.

నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారికి చోటు

ప్రజాశక్తి-విజయనగరం కోట

బొబ్బిలికి చెందిన బగ్గు జగదీష్, యాషిక రమ్యా దంపతుల కుమారుడు కనిష్క కృష్ణ రెండేళ్ల ప్రాయంలోనే చిన్నారి కనిష్క కృష్ణకు నోబుల్ బుక్ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్నాడు. ఏడాది వయసులోనే ఆటల్లోను, పాటల్లోనూ ప్రత్యేక సామర్థ్యాన్ని గుర్తించిన ఆ చిన్నారి పలు దేశాల జెండాలను, అంతరిక్షంలో నవ గ్రహాలను, స్వాతంత్ర్య సమరయోధులను గుర్తు పట్టేవాడు. వివిధ రకాల యాప్‌లను సునాయాసంగా గుర్తు పడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే ఆ బాలుడి మేథస్సును గుర్తించిన నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు సంస్థ సర్టిఫికెట్ అందజేసింది. ఈ సందర్భంగా ఆ చిన్నారిని సినీనటుడు మోహన్‌బాబు, మంచులక్ష్మితో పాటు శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభినందించారు.

నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న చిన్నారితో ఎంపి

మాట్లాడుతున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్

డ్రైవర్లకు కనీస వేతనమివ్వాలి

కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆర్‌టిసిలో పనిచేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఎపిపిటిడి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ డిమాండ్ చేశారు. శనివారం శనివారం హైర్ బస్సు కర్మికుల యూనియన్ జిల్లా నాయకులు జెఎస్‌ఎన్ రాజు అధ్యక్షతన ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. 2012 నుంచి కనీస వేతనాల చట్ట సవరణ చేయకుండా ప్రభుత్వాలు కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. హైర్ బస్ డ్రైవర్లకు ఇఎస్‌ఐ, పిఎఫ్ అమలు చేయాలని టెండర్‌లో కోడ్ చేసినప్పటికీ యాజమాన్యాలు అమలు చేయటం లేదన్నారు. ఆర్టీసీ రెగ్యులర్ సర్వీసుల్లో ప్రతి 3 బస్‌లకు ఏడుగురు డ్రైవర్లు ఉండాలన్న నిబంధన ఉందని, హైర్ బస్‌ల్లో ఆ నిబంధన పాటించడం లేదన్నారు. డ్రైవర్లకు ఇచ్చే అతి తక్కువ వేతనాలు కూడా యాజమాన్యాలు సకాలంలో చెల్లించడం లేదని, చేబదులు, అప్పుల రూపంలో తొలుత డబ్బులు ఇచ్చి తరువాత నెలలు తరబడి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. ఇటువంటి వారిపై ఆర్టీసీ యాజమాన్యం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కొన్ని డిపోల్లో విచ్చలవిడిగా మెడికల్ టెస్టుల పేరిట కొత్త వారిని తీసుకుని పాత డ్రైవర్ల కు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విధానంలో ఆర్టీసీ యాజమాన్యాలు నిజాయితీగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఇఎస్‌ఐ, పిఎఫ్ అమలు కోసం డ్రైవర్లంతా సంతకాల సేకరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాలు చట్ట సవరణతో పాటు, రూ 26వేలు అమలును రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైన జి. సురేష్‌ను పలువురు డ్రైవర్లు అభినందించారు. సమావేశంలో ధనుంజయ్, రాము, సంతోష్ కుమార్, సూర్యనారాయణ, గణేష్, శ్రీను, గోవిందు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న అసమ్మతి

- కష్టానికి ప్రతిఫలం ఇదేనా?
- దయచేసి యువత రాజకీయాల్లోకి రావద్దు
- మీ కలలను మధ్యలోనే చిదిమేస్తారు..
- కిమిడి నాగార్జున భావోద్వేగం
- కంట తడిపెట్టిన వైనం

సూపర్ సిక్స్ బ్రోచర్లను దగ్ధం చేస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి-చీపురుపల్లి

తెలుగుదేశం పార్టీ టికెట్ల కేటాయింపులో తాను అన్యాయానికి గురయ్యానని కిమిడి నాగార్జున కంటతడి పెట్టుకున్నారు. కష్టానికి ప్రతిఫలం ఇదేనా? అంటూ అధిష్టానాన్ని ప్రశ్నించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దుఖాన్ని దిగమింగుకుంటూ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి భావోద్వేగంగా ప్రసంగించారు. తనకు టిక్కెట్ కేటాయించపోవడం బాధాకరమని అన్నారు. తానైతే వెనక్కు తగ్గేదే లేదని తన కార్యాచరణ రెండు రోజుల్లో చెబుతానన్నారు. టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని, తన ఉద్యోగ జీవితాన్ని సైతం వదులుకుని రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యానన్నారు. 'యువత రాజకీయాల్లోకి రావాలని సభలు, సమావేశాల్లో నాయకులు చెబుతుంటారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి వస్తే సమాజం బాగుపడుతుందని అంటుంటారు. మనం ఆ మాటల్ని నమ్మి ఏదో చేద్దామన్న ఆశతో ఇక్కడి వరకు వస్తాం. అదంతా ఒక బూటకం. దయచేసి యువత ఎవరూ రాజకీయాల్లో వచ్చి జీవితాలను నాశనం చేసుకోవద్దు' అంటూ ఆవేదన చెందారు. ఇక్కడ మీ ఆలోచనలు ఎవరికీ అవసరం లేదని, సమాజాన్ని బాగు చేద్దామంటూ ఆ బాధ్యతను మీ భుజ స్కంధాలపై వేసుకోవద్దు అని యువతకు పిలుపునిచ్చారు. 'ఇతర ప్రాంతాల్లో ఉన్న యువత ఎప్పుడో ఓ సారి ఊరికి రండి. దేనికైనా సహాయం అందించండి.. అంతేగానీ రాజకీయాల్లోకి వచ్చి మీ జీవితాలను నాశనం చేసుకోవద్దు' అని అన్నారు. కష్టపడిన వారికి సీట్లు రావని, ఎన్నికలకు రెండు, మూడు నెలలు ముందు ఏదైనా జరగొచ్చు అని తెలుసుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేసారు. మొదటి నుంచి చంద్రబాబునాయుడు వెన్నంటే ఉన్నానని ఆయన ఏం చెబితే అది చేశానని, లేదంటే తాను ఆ రోజే ఇక్కడి నుంచి వెళ్లిపోయేవాడినని కన్నీటి పర్యంతమయ్యారు.

కార్యకర్తల ఆందోళన .. బ్రోచర్లు దగ్ధం

నాగార్జునకి టిక్కెట్ రాకపోవడంతో ఆయన అభిమానులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పార్టీ కార్యాలయంలో పార్టీకి, కళావెంకటరావుకి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. సూపర్ సిక్స్ కర పత్రాలను దగ్ధం చేశారు. తమ నాయకుడు నాగార్జున వెంటే తామంతా నడుస్తామని కార్యకర్తలు అన్నారు. కార్యక్రమం లో నాలుగు మండలాలు నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, వెన్నె సన్యాసి నాయుడు, దన్నాన రామ చంద్రుడు,తాడ్డే సన్యాసి నాయుడు,సారేపాక సురేష్ బాబు,చనమాల మహేశ్వర రావు,ముల్లు రమణ, మహంతి అప్పలనాయుడు, రెడ్డి గోవింద, గవిడి నాగరాజు, మండల చంటి, అరతి సాహు, సంచాన సన్యాసి నాయుడు, నాలుగు మండలాలు సర్పంచ్లు, మాజీ ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే పోటీ

యువనేత గొంప క్రిష్ణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రజాభీష్టం మేరకే ఎన్నికల్లో పోటీ చేస్తానని యువనేత గొంప క్రిష్ణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తలతో శనివారం సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అనంతరం గొంప క్రిష్ణ మాట్లాడుతూ టిడిపి మండల అధ్యక్షులతో హైదరాబాద్‌లో నారా లోకేష్‌ని కలిసినట్లు తెలిపారు. తన సమస్యలను, నియోజకవర్గంలో రెండేళ్లుగా జరుగు తున్న పరిణామాలను, పరిస్థితులను లోకేష్‌కి వివరించామన్నారు. పార్టీ కచ్చితంగా తనకు అన్ని రకాల అవకాశాలు ఇస్తామని చెబుతోందని, కానీ తనకు కావాల్సింది సొంత ప్రయోజనాలు కాదని తెగేసిచెప్పారు. తనతోపాటు నడిచిన కేడర్? తనను నమ్మి ఇంతవరకు ప్రయాణం చేసిన ఓటర్ల పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో వారికి ఏ విధంగా సహాయ సహకారాలు అందించగలనన్నారు. అందుకే నమ్ముకున్న కేడర్ ఏం చెబితే అది చేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టంచేశారు. అందులో భాగంగా ఆదివారం పట్టణంలోని ఆకులడిపో వద్ద నిర్వహించే బహిరంగ సభలో ప్రజాభిప్రాయం మేరకే ఎన్నికల్లో పోటీ చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో గొరపల్లి రాము, రాయవరపు చంద్రశేఖర్, రెడ్డి పైడిబాబు, జుత్తాడ రామసత్యం, ఆడారి రమేష్, మాదిబోయిన మంగరాజు, ఆడారి ఉమా మహేశ్వరరావు, గనివాడ సన్యాసి నాయుడు, జగదీశ్, మోపాడ అప్పారావు, అక్కునాయుడు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

వేపాడ : శృంగవరపుకోటలో ఆదివారం నిర్వహించే గొంప క్రిష్ణ బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల నాయకులు గొంప వెంకటరావు కోరారు. వేపాడలో నియోజకవర్గ మహిళా నాయకులు గుమ్మడి భారతి నివాసంలో సీనియర్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గొంప క్రిష్ణకు టిక్కెట్టు ఇస్తానని నమ్మించి మోసం చేశారన్నారు. నమ్మకద్రోహానికి పాల్పడిన అధిష్టానానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలన్నారు. నమ్ముకున్న వారి కోసం కుటుంబ సభ్యుడిలా నిలబడిన గొంప క్రిష్ణను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అందులో భాగంగా ఆకులడిపో వద్ద ఆదివారం నిర్వహిస్తున్న బహిరంగ సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు గణేష్, గుమ్మడి రవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యువనేత గొంప క్రిష్ణ

యువత ఓటు వేసేందుకు ముందుకురావాలి

జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఎన్‌సిసి క్యాడెట్లు, యువత

ప్రజాశక్తి-విజయనగరం కోట

పట్టణ ప్రాంతాల్లో ఓటుహక్కు వినియోగించుకుంటున్న వారి శాతం తక్కువగా ఉంటోందని, దీంతో పాటు యువత కూడా ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదని, వీరంతా వచ్చే సాధారణ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ముందుకు వచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ విజ్ఞప్తి చేశారు. నగరంలోని యువఓటర్లు, పట్టణ ప్రజలకు ఓటుహక్కు వినియోగించు కోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించే నిమిత్తం ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం 2కె రన్ నిర్వహించారు. స్థానిక కోట జంక్షన్ నుంచి ప్రారంభమై రాజీవ్ స్టేడియం వరకు జరిగిన పరుగులో జెసితో పాటు ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు, నెహ్రూయువ కేంద్రం అధికారి ఉజ్వల్, నగర యువత, ఎన్‌సిసి. క్యాడెట్లు క్రీడాకారులు ఈ పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఓటరుగా నమోదైన యువత ఓటు విలువ తెలుసుకొని దానిని వినియోగించుకోవడం ద్వారా దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు.

మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆదర్శ పాఠశాలలలో 2024 -25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31 నుంచి వచ్చేనెల 6వరకు గడువు పొడిగించినట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 13 ఆదర్శపాఠశాలల్లో 2024 -25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో చేరేందుకు ఏప్రిల్ 21న జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారపు. ఈ ప్రవేశ పరీక్షకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ప్రవేశపరీక్ష 5వ తరగతి స్థాయిలో తెలుగు/ ఇంగ్లీష్ మీడియంలో ఉంటుందని తెలిపారు. ఆదర్శపాఠశాలల్లో బోధన ఇంగ్లీషులోనే ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు net baking/ credit/ debit card payment Gateway తరువాత వారికి ఒక జనరల్ నెంబరు కేటాయిస్తారని, ఆ నెంబరు ఆధారంగా ఏదైనా www.cse.ap.gov.in లేదా https://apms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ కె.రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 5,6,7,8 తరగతులలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లు, ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు ఏప్రిల్ ఐదో తేదిలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టిడిపిలోకి మక్కువ శ్రీధర్?

- ఆయన వెంట పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు
- నేడో రేపు ముహూర్తం

ప్రజాశక్తి-గజపతినగరం

వైసిపి నాయకుడు, మాజీ ఎంపిపి మక్కువ శ్రీధర్ వైసిపిని వీడి టిడిపిలో చేరనున్నారు. చాలా కాలంగా వైసిపిలో కొనసాగుతున్న ఆయనకు ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తగిన స్థానం కల్పించకపోవడంతో మనస్థాపం చెందిన ఆయన తన అనుచరులతో కలసి పార్టీని వీడుతున్నట్లు సన్నిహితులకు తెలిపారు. ఇందుకు నేడో, రేపు ముహూర్తం పెట్టనున్నారు. ఆయనతో పాటు పలు గ్రామాలకు చెందిన తాజా, మాజీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు కూడా టిడిపిని వీడనున్నారు. మక్కువ శ్రీధర్ 2001లో జెడ్‌పిటిసి సభ్యుడిగా, 2006 ఎంపిపిగా, 2014లో జెడ్‌పిటిసి సభ్యుడిగా పదవులు చేపట్టారు. తొలుత కాంగ్రెస్‌లో ఉన్న ఆయన తరువాత టిడిపిలో చేరారు. వైసిపి ఆవిర్భావం తరువాత జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఆ తరువాత 2014లో టిడిపిలో చేరారు. 2019 ఎన్నికల్లో తిరిగి వైసిపిలో చేరినప్పటికీ ఆయనకు ఎమ్మెల్యే అప్పలనర్సయ్య తగిన ప్రాధాన్యతను కల్పించలేదు. అప్పటి నుంచి ఏ కార్యక్రమం జరిగినా ఎమ్మెల్యే పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీధర్ పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో శ్రీధర్‌కు పట్టుంది. ఆయనతో పాటు వారంతా టిడిపిలో చేరడంతో వైసిపికి గట్టి దెబ్బే తగులుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఓటరుతో ఎటకారమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓటరుతో ఎటకారమా? అదీ ఎన్నికల వేళ...! ఎటకారమంటే మామూలు ఎటకారం కాదండోయ్...బాధ్యత మరిచి, హోదాను పక్కనబెట్టి మరీఅవహేలనగా, అవమానపర్చేలా... ప్రవర్తించడం జిల్లాలో చర్చనీయాశంగా మారింది. అందులోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే, మరోసారి ఎమ్మెల్యేగా వెలగబెట్టేందుకు ఓట్లు ఆర్జించడం కోసం వెళ్లి మరీ గిరిజన మహిళ ఒంటిపై చేయివేసి, చీర, జాకెట్లు వేసుకుంటున్నావుగా? అంటూ సంబోధించడం పట్ల జనం విస్తుపోతున్నారు. ఆయన ఎవరో కాదు... విజయనగరం జిల్లాకు చెందిన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినఅప్పనాయుడు.

తమ సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు రెండు నెలల క్రితం సమ్మెబాట పట్టిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఒళ్లు బలిసి సమ్మె చేస్తున్నారంటూ శంబంగి చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజానీకం యావత్తు తప్పుపట్టారు. ఆ మాటలను ఉపసంహరించుకోవాలంటూ పలు చోట్ల అంగన్‌వాడీలు, వారి తరపున యావత్తు మహిళలు, పలు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ ఘటన ఇంకా మర్చిపోక ముందే మరో గిరిజన మహిళపై చేయివేసి మరీ శంబంగి వెటకారం ప్రదర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బొబ్బిలి మండలం డొంగురువలస గిరిజన గ్రామంలో ఓట్లు అర్జించేందుకు వెళ్లిన శంబంగిని 'ఊరుని అభివృద్ధి చేయలేదు, రోడ్లూ లేవు, కాలువలూ లేవు' అంటూ ఓ గిరిజన మహిళ నిలదీసింది. దీనికి బాధ్యతగా సమాధానం చెప్పాల్సిన ఎమ్మెల్యే 'ఇంతకు ముందు చీర కట్టావా? జాకెట్టు వేశావా? ఇప్పుడు కడుతున్నావు కాదా? మరి అది అభివృద్ధి కాదా? అంటూ నిస్సిగ్గుగా మాట్లాడారు. దీనికి బదులిచ్చిన ఆ మహిళ 'ఎక్కడున్నవాళ్లం అలాగే ఉన్నాం. అందుకే మమ్మల్ని వదిలేయండి' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. అప్పటికీ ఎమ్మెల్యే కళ్లు తెరుచుకోలేదు. 'ఏ ఊర్లో వారు ఆ ఊళ్లో ఉండక పొరుగూర్లో ఉంటారా? అంటూ సమాధానం చెప్పారు. అంతటితో ఆగలేదు. ఆయన వెంట వచ్చిన మరో నాయకుడు 'నీకు పెళ్లి అయినప్పుడు ఈ ఊరు ఇలాగే ఉందా? ఇప్పుడు డాబా ఇళ్లు కనిపిస్తున్నాయిగా అంటూ మరింత ఎటకారంగా మాట్లాడారు. ఆ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో జిల్లాలో పబ్లిక్ టాక్‌గా మారింది. ఎమ్మెల్యే తీరుపై అన్ని తరగుతల ప్రజానీకం మండిపడుతున్నారు. అభివృద్ధి చేయడం చేతకాక, అమాయక మహిళలను అవహేళన చేస్తూ మాట్లాడడం ఆయనకు సిగ్గుచేటు అనిపించడం లేదేమో అంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే చీరలు, జాకెట్లనే అభివృద్ధి అని చేసిందేముందిలే అంటూ మరికొందరు నవ్వుకుంటున్నారు. ఎన్నికల్లో ఓట్లు అడుక్కోవడానికి వచ్చినప్పుడే ఇలా వ్యవహరిస్తే గెలిచాక మరింత రెచ్చిపోతారో అని చర్చించుకుంటున్నారు.

అభివృద్ధి చేస్తా.. అవకాశమివ్వండి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన కోరారు. పట్టణంలోని నాలుగో వార్డులో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. బేబినాయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో బేబినాయనకు మద్దతుగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'తెలగ'కు బిసి రిజర్వేషన్ కల్పించాలి

తెలగ సామాజిక తరగతికి బిసి రిజర్వేషన్లు కల్పించాలని తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్.ప్రసాదరావు... బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. దీనిపై బేబినాయన హామీ ఇచ్చారు.

అవన్నీ తప్పుడు ఆరోపణలు

ప్రజాశక్తి-బొబ్బిలి

జనసేన బలోపేతానికి, పవన్‌కళ్యాణ్ ఆశయ సాధనకు పని చేస్తుంటే తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని ఆ పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కమిటీ కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. జనసేన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన ఏర్పాటు నుంచి పని చేయడంతో బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, కురుపాం ప్రాంతాల్లో మంచి గుర్తింపు వస్తోందన్నారు. జనసేనలో తనకు మంచి గుర్తింపు రావడం వల్లే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. 2021 నుంచి రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కమిటీ కార్యదర్శిగా పని చేస్తున్నట్లు చెప్పారు. కొంతమంది స్వార్ధ ప్రయోజనాల కోసం ఆలోచిస్తే తాము జనసేన కోసం పని చేస్తున్నామని చెప్పారు. చక్కెర పరిశ్రమ సమస్యపై పోరాటం చేస్తే కుటుంబంపై బెదిరింపులకు దిగారని గుర్తుచేశారు. జనసేనకు, ప్రజలు, బొబ్బిలి ప్రాంతానికి నష్టం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జనసేన మండల అధ్యక్షులు ఎస్.గంగాధర్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి విభజించి పాలించు రకంగా పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎం.రవికుమార్, ఆర్.కిరణ్ కుమార్, జనసైనికులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-రామభద్రపురం

డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక నిఘా ఉంచామని మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని కొట్టక్కి, మిర్తివలస గ్రామం వద్ద శనివారం సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ టెస్టులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. రోడ్డుభద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని కోరారు. ఇప్పటికే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఎన్నికల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎన్నికల్లో పిఒ, ఎపిఒలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్ఒ ఎం.నూక రాజు సూచించారు. శనివారం నియోజక వర్గ స్థాయిలో పిఒ, ఎపిఒలకు స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎం, వివి ప్యాట్లు తనిఖీ చేసి వినియోగించాలన్నారు. ఓటర్లు జాబితా సారిగా చూసుకొని ఒకటికి రెండసార్లు తనిఖీలు చేసి ఓటు వెయ్యడానికి అనుమతించాలని సూచించారు. పోలింగ్ అధికార్లు నిర్లక్ష్యంగా ఉండరాదని ఇవిఎంలో ఇబ్బందులు వస్తే వెంటనే సంబంధిత అధికారికి తెలియపర్చి సమస్య పరిష్కారించాలని తెలిపారు. పోలింగ్ రోజున ఎటువంటి ఘర్షణలు, అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు తప్పని సరిగా కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ఒ డి. ధర్మ రాజు, ఎన్నికల డిటి వివిఎస్ఎన్ మూర్తి, శిక్షకులు సిహెచ్ ఆనంద్ మూర్తి, పి. త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణపై దాడికి ఖండన

ప్రజాశక్తి-విజయనగరం కోట

మాదిగ మందకృష్ణపై కొంతమంది మాదిగ సంఘ నాయకులు మూకుమ్మడిగా దాడి చేయడం దారుణమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు భోగి శ్రీను మాదిగ అన్నారు. శనివారం అంబేద్కర్ జంక్షన్ వద్ద గల అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమికి మద్దతు తెలిపిన మందకృష్ణపై కొంతమంది మాదిగ సంఘం నాయకులు మూకుమ్మడిగా దాడి చేయడం సరైనది కాదన్నారు. మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్, లీడ్ క్యాప్ ఛైర్మన్ మాదిగల కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధికార ప్రతినిధి పొందూరు విజయ రామారావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలో రన్‌ఫర్ జీసస్ పేరిట క్రైస్తవులు శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక అసెంబ్లీ చర్చి నుండి చిన్నవీధి న్యూ పూర్ణ గంట స్తంభం మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిమ్స్ బాపిస్టు చర్చ్ సంఘమిత్ర ఆర్ఎస్‌జాన్ మాట్లాడుతూ క్రీస్తు లోకానికి మార్గదర్శకుడు అని అన్నారు. లోకాన్ని సన్మార్గంలో నడిపేందుకు క్రీస్తు చేసిన త్యాగాలు మారువలేనివి అని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ చర్చి ప్రెసిడెంట్ కార్యదర్శులు టి ఆనందరావు , బిషప్ సత్యరాజ్, ఏసుదాసు, కరుణ భాను ,సామ్యూల్, మధు మనోహర్, శ్రీనివాస్ పాల్ ఎస్పాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలో అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చొక్కాకు రామయ్యమ్మ స్మారక గ్రంథాలయాన్ని శనివారం ఎన్ఆర్ఐ పోడిపిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం ద్వారా విద్యార్థులు, నిరుద్యోగ యువత విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. సంస్థ వ్యవస్థాపకులు చొక్కాకు సన్యాసినాయుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గ్రంథాలయాభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో రెడ్డి రాజప్పలనాయుడు, పొడిపిరెడ్డి రామునాయుడు, చొక్కాకు రామకృష్ణ, శ్రీనివాసరావు, సీతారాం, గండి తవిటినాయుడు, రెడ్డి జగన్నాథం పాల్గొన్నారు.

చింతలపాలెంలో కోళ్ల ప్రచారం

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని చింతలపాలెంలో శనివారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వైసిపి ఎమ్మెల్యే ఏ అభివృద్ధి చేశారో చూపించాలని ప్రశ్నించారు. పరిపాలన చేతకాక నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నడిపించలేని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రజల ముందుకు ఏ మొహం పెట్టుకొని ఓట్లడిగేందుకు వస్తున్నారని నిలదీశారు. చింతలపాలెం పంచాయతీలో ఇప్పటివరకు సిసి రోడ్డు కూడా వేసిన పాపాన పోలేదని ఆక్షేపించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాకిన సీతారాం పాత్రుడు, టిడిపి మాజీ మండల అధ్యక్షులు కోళ్ల శ్రీనివాసరావు, నాయకులు బొబ్బిలి అప్పారావు, పి.రత్నాజీ, తదితరులు పాల్గొన్నారు.

పోరాటం కొనసాగిస్తాం

మిమ్స్ ఉద్యోగుల నిరసనలో నాయకులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న పోరాటాన్ని కొనసాగిస్తామని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి రమణ తెలిపారు. స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరసన పోరాటం శనివారం నాటికి 59వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా టివి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ శిబిరంలో మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు 7డిఎలు, బకాయిలు చెల్లించాలని, 2019 నుంచి వేతన ఒప్పందం చేయాలని, వేధింపులు, బదిలీలు ఆపాలని కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని 58 రోజులుగా నిరశన పోరాటం చేస్తుంటే యాజమాన్యం చర్చల పేరిట కాలయాపన చేస్తుందన్నారు. శనివారం జరిగిన చర్చల్లో మిమ్స్ యాజమాన్యం 7శాతం డిఎ ఇవ్వడానికి అంగీకారం తెలిపి, వేతన ఒప్పందం కొత్త నిబంధనల ప్రకారం చేస్తామని అది కూడా ఏప్రిల్ నెల నుంచి ఇస్తూ ఆగస్టులో అగ్రిమెంట్ చేస్తానని చెప్పడం భావ్యం కాదన్నారు. ముందు వేతన ఒప్పందం అగ్రిమెంట్ చేయాలని కొత్త వేతన ఒప్పందం ప్రకారం పెరిగిన వేతనాలు ఆగస్టు నుంచి అమలు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.

నిరసన శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు టివి రమణ

ఉద్యోగులు, కార్మికులు చేసిన నిరశన పోరాట కాలానికి కూడా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటామని యాజమాన్యం చెప్పినట్లు తెలిపారు. కాగా చర్చలు సోమవారానికి వాయిదా పడ్డాయని వివరించారు. యూనియన్ ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్ వద్ద అగ్రిమెంట్ చేయాలని ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారని తెలిపారు. కాగా నిరశన పోరాటం కొనసాగిస్తారని హెచ్చరించారు. శిబిరంలో మిమ్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణ, ఉద్యోగులు కె. కాము నాయుడు, కె.మధు, ఎం.నాగభూషణం, గౌరీ, వరలక్ష్మి, బి. బంగారు నాయుడు, మూర్తి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి : బొత్స

ప్రజాశక్తి-కొత్తవలస

వచ్చే ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు విజయానికి కృషి చేయాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. కొత్తవలసలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన వైసిపి వేపాడ మండల విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లను పోలింగ్ బూత్‌కి తీసుకుని వెళ్లి ఓటు వేయించాల్సిన బాధ్యత అందరిదని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఎం.కస్తూరి, తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వండి

మెరక ముడిదాం. : రాష్ట్రం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రజలు మరొకసారి ముఖ్యమంత్రిగా జగన్ మోహన రెడ్డికి అవకాశాన్ని కల్పించాలని చీపురుపల్లి వైసిపి అభ్యర్థి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎం. రావి వలస , జి. మర్రివలస పంచాయతీ పరిధిలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భముగా అయన మాట్లాడుతూ ఒక్క పైసా అవినీతి జరగని సంక్షేమ పాలన చేపట్టామన్నారు. ఒకప్పుడు వలసలకు నిలయమైన ఈ మండలం ఇప్పుడు జిల్లాలోనే అభివృద్ధి చెందిన మండలంగా నిలిచిందని చెప్పారు. మరింత అభివృద్ధి చేసేందుకు మళ్లీ ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. టిడిపి మాయ మాటలు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, యువ నాయకులు డాక్టర్ బొత్స సందీప్, మండల నాయకులు, స్థానిక సత్పంచ్ లు పాల్గొన్నారు.

గ్రామాల్లో టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఆడవరం, లక్ష్మీపురం, అక్కన్న అగ్రహారం, అప్పాపురం, మజ్జి రాముడు పేట గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. టిడిపి గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ ప్రచారంలో టిడిపి నాయకులు కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, కర్నేన మహేశ్వరరావుతో టిడిపి సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబు సారథ్యంలో జత కలిసిన ఎన్‌డిఎ కూటమినే రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని మరలా ముఖ్యమంత్రిగా చంద్రబాబు వస్తేనే ఈ రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అబివృద్ధి సాధ్యమవుతుందనీ రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ఐదేళ్ళలో సంక్షేమ పథకాలు పేరిట లక్షల కోట్ల రూపాయిలు అప్పులు చేసి ప్రజలకు నేరుగా జమ చేస్తున్నామని చెపుతూ అనేక మోసాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు వైసిపికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, నాయకులు కనిమెరక వెంకటి తదితరులు పాల్గొన్నారు

అశోక్‌ను కలిసిన కలిశెట్టి

ప్రజాశక్తి-విజయనగరం కోట

అనూహ్యంగా విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ సీటు దక్కించుకున్న టిడిపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు శనివారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపునకు పార్టీ నాయకులంతా అండదండలు ఇవ్వాలని కోరారు. అశోక్‌ను కలిసిన వారిలో కలిశెట్టి కుటుంబ సభ్యులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో అనుమతిలేని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు, వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నగర పంచాయతీ కమిషనర్‌కి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్, 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, 3వ వార్డు కౌన్సిలర్ మొయిద శ్రీనివాసరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా సతీష్, నాయకులు పైల మురళి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్ సినిమా హాల్ వద్ద 6 అంతస్థుల భవనం ఎటువంటి అనుమతులూ లేకుండా అక్రమంగా నిర్మాణం చేశారన్నారు. అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం రహదారి భవనాల శాఖ స్థలంలో టౌన్ ప్లానింగ్ అనుమతి లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నారని పలు మార్లు అధికార్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నగరం నడి బొడ్డున ఇటువంటి అక్రమ నిర్మాణాలు చేస్తున్నా నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. అధికార్లు వెంటనే స్పందించి సినిమా హాల్ వద్ద అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా : ఎస్‌పి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా పెట్టాలని ఎస్‌పి దీపిక.. పోలీసు సిబ్బందికి సూచించారు. పాత బొబ్బిలి జంక్షను వద్ద ఏర్పాటు చేసిన అంతర జిల్లా చెక్ పోస్టును ఎస్‌పి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది చేపడుతున్న వాహన తనిఖీలను పరిశీలించారు. ఇరు జిల్లాల మధ్య వచ్చి, పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాహనాల వివరాలను రిజిష్టరులో నమోదు చేయాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ రాజకీయ పార్టీలు తరలించే మద్యం, నాటుసారా, గంజాయి, నగదు, ప్రోత్సాహక బహుమతులు, చీరలు, వాచీలు వంటి ఇతర వస్తువుల అక్రమ రవాణాను నియంత్రించాలన్నారు. వాహన తనిఖీల్లో అక్రమ రవాణాకు వినియోగించే వాహనాలను, వస్తువులను సీజ్ చేయాలన్నారు. అనంతరం మెట్టవలస, పారాది పోలింగు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగు కేంద్రాల వద్ద ఇప్పటి వరకు చేపట్టిన భద్రత చర్యలను బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, సిఐ ఎం.నాగేశ్వరరావు.. ఎస్‌పికి వివరించారు.

చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి

హైనాను జూకు తరలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

గోతిలో పడిన హైనా

పట్టుకున్న అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వల్లూరు పంచాయతీ పిన తరిమిలో హైనా (దుమ్మల గొండి) విద్యుత్‌శాఖ సిబ్బంది తీసిన గోతిలో శుక్రవారం రాత్రి పడిపోయింది. శనివారం ఉదయం గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఫారెస్ట్ సిబ్బంది వచ్చి జెసిబి సాయంతో బయటకు తీసి వ్యాన్‌లో విశాఖపట్నంలోని జంతు ప్రదర్శన శాలకు తరలించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కెవిఎస్ రాజు, ఎఫ్‌బిఒ రామారావు తదితరులు పాల్గొన్నారు.

తగిన గుణపాఠం చెబుతాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కొప్పల వెలమలకు రానున్న ఎన్నికల్లో నిర్లక్ష్యానికి గురి చేసిన రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని కొప్పలవెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిలపర్తి పరదేశి నాయుడు, జిల్లా అధ్యక్షులు బొత్స వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి తెంటు కాశీనాయుడు హెచ్చరించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అత్యధిక జనాభా కలిగిన కొప్పుల వెలమలు నిరాదరణకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో సీట్లు కేటాయింపుల్లో అన్ని రాజకీయ పార్టీలు విస్మరించాయన్నారు. అధికార పార్టీ ఒక్క టికెట్ ఇచ్చిందని, ప్రతిపక్ష కూటమి ఒక్క టికెట్ కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. తమను నిరాదరణకు గురి చేస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు మేళాపు శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

సార్వత్రిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు వైసిపి బూత్ కన్వీనర్లకు సూచించారు. శనివారం పట్టణంలో బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం కోసం ఐక్యంగా పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వైసిపితోనే ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

ఇంధన పరిరక్షణపై ర్యాలీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంధన శక్తి పరిరక్షణపై శనివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ముందుగా ప్రిన్సిపల్ సిహెచ్ రమణమూర్తి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సహజ వనరుల లభ్యత తగ్గుముఖం పడుతున్నవేళ దేశ ఆర్థిక ప్రగతికి ప్రధాన మూలమైన ఇంధన శక్తిని ఆదా చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఇంధనాన్ని ఆదా చేయడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. అవసరం మేరకు మాత్రమే వాహనాలు, విద్యుత్తు ఉపయోగించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో ఇంధన శక్తి పరిరక్షణపై క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

నగర పాలక సంస్థ ద్వారా వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న అయాలకు నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి వేతనాలు ఇవ్వాలని కోరుతూ కమిషనర్ ఎం ఎం నాయుడుకు శనివారం సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్ వినతి అందజేశారు. డిసెంబర్‌లో సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులతో పాటు స్కూల్ ఆయాలకు మున్సిపాల్టీల నుంచి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, అమలు చేయాలని కోరారు. వినతినిచ్చిన వారిలో ఇచ్చిన భేగం,మాధవి,పైడిరాజు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఒకటో పట్టణ పోలీసు స్టేషన్లో గత ఏడాది నమోదైన గంజాయి కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శనివారంతీర్పు వెల్లడించినట్లు సిఐ బి.వెంకటరమణ తెలిపారు. రైల్వేస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ వెనుకభాగంలో గత ఏడాది ఫిబ్రవరి 2న భర్తకాన శేఖర్, షేక్ ఖురేష్ గంజాయి ప్యాకెట్లు అమ్మడానికి ప్రయత్నించగా, ఒకటో పట్టణ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష పడిందని తెలిపారు.

అందుబాటులో ఉన్న వారిని గెలిపించండి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పడాలపేట పరిధిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న వ్యక్తులనే గెలిపించాలని కోరారు. మరోసారి అవకాశాన్ని ఇస్తే సమస్యలను నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనలో సంక్షేమ పాలన సాగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు నేరుగా అందాయన్నారు. మరోసారి తమకు అవకాశం ఇస్తే అభివృద్ధి సంక్షేమాన్ని మరింతగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథరావు, గ్రామ సర్పంచ్ సువ్వాడ శ్రీదేవి, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఒకసారి అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

జనసేన అభ్యర్థి లోకం మాధవి

ప్రజాశక్తి - భోగాపురం

వచ్చే ఎన్నికల్లో తనకు ఒకసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని కూటమి అభ్యర్థి లోకం మాధవి అన్నారు. మండలంలో శనివారం నుంచి ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుందర పేట, చెరువుకొమ్ముగొల్ల పేట, అప్పన్నపేట, కొయ్యపేట, సిమ్మ పేట, కొల్లిపేట గ్రామాలలో ప్రచారం చేశారు. కాలువలు రోడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని అప్పన్నపేట గ్రామస్తులు ఆమెకు తెలిపారు. మీ సమస్యలు పరిష్కారం కావాలంటే తనకు ఒకసారి అవకాశం ఇవ్వాలని ఆమె అన్నారు

జనసేనలో చేరిన మాజీ సర్పంచ్, ఎంపిటిసి

జనసేన పార్టీలో పెద్దకొండ్రాజుపాలెం పంచాయతీకి చెందిన మాజీ ఎంపిటిసి సూరాడ వీరస్వామి, మాజీ సర్పంచ్ సురపతి నర్సింహులు, వార్డ్ మెంబర్స్ ఎరుపల్లి రాములమ్మ, ఎరుపల్లి సన్యాసిరావు, సూర్ని సన్యాసి, మైలపల్లి నూకయ్య, సూర్ని తిమ్మయ్య, రాయితీ కృష్ణ, మారుపల్లి ఎర్రయ్య శనివారం జనసేన పార్టీలో చేరారు. ఆ పార్టీ నాయకులు బడే జీ.కే ఆధ్వర్యంలో వీరంతా చేరారు. చేరిన వారికి కూటమి అభ్యర్థి లోకం మాధవి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. భోగాపురంలోని కాకర్లపూడి శ్రీనివాసరాజు కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైలపల్లి అప్పలకొండ, న్యాయవాది సుధాకర్, పల్లంట్ల జగదీశ్, పల్ల రాంబాబు, పల్ల శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకులు, కార్యకర్తలతో అభ్యర్థి మాధవి

చౌడువాడలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ ప్రభుత్వాన్ని తమను మరోసారి ఆశీర్వదించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు ఎంఎల్‌సి పి. సురేష్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని చౌడువాడ పంచాయతీ పరిధిలో ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడును, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేందుకు ఈ ప్రభుత్వం మరలా రావాలన్నారు. ప్రచారంలో ఎంపిపి మహంతి కళ్యాణి, వైస్ ఎంపిపిలు రమేష్, సత్యనారాయణరాజు, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, నాయకులు మహంతి జనార్ధనరావు, బర్రి చిన్నప్పన్న, నాయకులు మొంగం నాగబాబు, మొంగం మంగమ్మ, కొయ్య ఎల్లన్నరెడ్డి, గోవిందపురం నాయకులు పట్టెపు శ్రీనువాసరావు, బొర చిన్నారెడ్డి, రౌతు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న వైసిపి అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు

రేగిడి : మండలంలోని గుల్లపాడు, వండాన పేట, కెయం వలస రాజాం నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ శనివారం ప్రచారం చేపట్టారు. ఈయనతోపాటు వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు, కింజరాపు సురేష్, వియ్యపు చక్రపాణ తదితరులు ఉన్నారు.